క్లుప్తంగా

ఘనంగా బాబా దర్గా ఉరుసు



ఉరుసు మహోత్సవం సందర్భంగా ద్రాక్షారామలో గంధోత్సవం

రామచంద్రపురం రూరల్: మండలంలోని ద్రాక్షారామ సయ్యద్ షాబాజ్ ఔలియా బాబా దర్గా వద్ద ఉరుసు మహోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. దర్గాలో ప్రత్యేక పూజలు చేశారు. జెండాతో గంధోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ముతవలీ మహ్మద్ కాలేషా మస్తాన్ వలీ, మత గురువు తసదుఖ్ హుస్సేన్, ఎండీ మౌలానా షరీఫ్, మసీదు కమిటీ అధ్యక్షుడు షేక్ ఖాజామొహిద్దీన్, కార్యదర్శి షేక్ అహ్మద్ వలీ, ఎండీ నౌషాద్, ద్రాక్షారామ, పరిసర గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సిద్ధి వినాయకుని విగ్రహ ప్రతిష్ఠ

కె.గంగవరం: మండలంలోని పాణింగపల్లిలో నూతనంగా నిర్మించిన సిద్ధి వినాయకుని ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ బుధవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. వాసంశెట్టి శ్రీనివాస్ దంపతులు, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్, సర్పంచ్ చీకట్ల సునీత, ఉప సర్పంచ్ గొడితి నాగేశ్వరరావు, వైస్ ఎంపీపీ నీతిపూడి మధుబాల, సొసైటీ చైర్మన్ వైట్ల అచ్యుత రామప్రసాద్, శెట్టిబలిజ సంఘ నాయకుడు నరాల ఏడుకొండలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కల్యాణ మంటపానికి శంకుస్థాపన



శెట్టిబలిజ కల్యాణ మంటపానికి శంకుస్థాపన చేస్తున్న సూర్యప్రకాష్

రామచంద్రపురం: పట్టణంలోని కొత్తూరు రోడ్డులో కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయ ఆవరణలో ఎంపీ నిధులతో నిర్మించే శెట్టిబలిజ కల్యాణ మంటపానికి ఎంపీ పిల్లి సుభాష్‌చంద్రబోస్, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త పిల్లి సూర్యప్రకాష్‌లు బుధవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, వైస్ చైర్మన్‌లు చింతపల్లి నాగేశ్వరావు, కోలమూరి శివాజీ, కో ఆప్షన్ సభ్యులు గుబ్బల గణ, గుబ్బల వారి పేట సంఘ శెట్టిబలిజ పెద్దలు దంగేటి భద్రరావు, నున్నబోయిన శ్రీరాములు, నున్నబోయిన అర్జున్, అనసూరి బ్రహ్మారావు, పిల్లి గోవింద్, కుడిపూడి భీమన్న, దంగేటి సూరిబాబు, వివిధ వార్డు కౌన్సిలర్లు, పట్టణ నాయకులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు ప్రారంభించిన ఎంపీ బోస్



పాణింగపల్లిలో సీసీ రోడ్డు ప్రారంభిస్తున్న ఎంపీ బోస్

కె.గంగవరం: మండలంలోని పాణింగపల్లిలో మండల ప్రజాపరిషత్ నిధులు రూ.2.50 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్ బుధవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా ప్రభుత్వం పని చేస్తుందన్నారు. రానున్న ఎన్నికల్లో తన కుమారుడు పిల్లి సూర్యప్రకాష్‌ను ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చీకట్ల సునీత, వైస్ ఎంపీపీ నీతిపూడి మధుబాల, సొసైటీ చైర్మన్ వైట్ల అచ్యుతరామప్రసాద్, నాయకులు చీకట్ల గోపాలం, నీతిపూడి కొండ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

చేరికల పేరుతో టీడీపీ తప్పుడు ప్రచారం తగదు



మండపేటలో విలేకరులతో మాట్లాడుతున్న రవికుమార్

కపిలేశ్వరపురం (మండపేట): తమ పార్టీలో చేరారంటూ మండపేట, మండలంలోని గ్రామాల్లోనూ టీడీపీ తప్పుడు ప్రచారం చేస్తోందని మండపేట మున్సిపల్ 8వ వార్డు కౌన్సిలర్ రవికుమార్ అన్నారు. పట్టణంలో బుధవారం విలేకరులతో మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటున్న ఎమ్మెల్యే వేగుళ్ల తన ఉనికిని కాపాడుకునేందుకు టీడీపీకి లేని బలాన్ని సృష్టించుకునే పనిలో ఉన్నారన్నారు. వైఎస్సార్ సీపీ నుంచి టీడీపీలో చేరారంటూ మంగళవారం టీడీపీ చేస్తున్న ప్రచారంలో వాస్తవం లేదన్నారు. పార్టీలో చేరారంటూ చెబుతున్న పేర్లు తమ పార్టీ వారివి కాదన్నారు. తప్పుడు ప్రచారాన్ని టీడీపీ మానుకోవాలని హితవు పలికారు.

సేవాగుణానికి ప్రతీక వలంటీర్ వ్యవస్థ

ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

కపిలేశ్వరపురం: గ్రామాల్లోని పేద, మధ్య తరగతి ప్రజలకు విశేష సేవలందిస్తున్న వలంటీర్లు సేవా గుణానికి ప్రతీకలని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. మండలంలోని 19 గ్రామాల్లో ఎంపికైన వలంటీర్లకు సేవా అవార్డులను ఆయన చేతుల మీదుగా అందజేశారు. అంగరలో బుధవారం ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో సేవా వజ్ర, సేవా రత్న, సేవా మిత్ర అవార్డులను వలంటీర్లకు ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి, జెడ్పీటీసీ పుట్టపూడి అబ్బు, ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, నియోజకవర్గం సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు వీధి వెంకటరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు శీలం గోవింద్, తదితరులు చేతుల మీదుగా అందజేశారు. వలంటీర్ల సేవలను సర్పంచ్ వాసా కోటేశ్వరరావు, తిరునాతి ఆదిలక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు మేడిశెట్టి దుర్గారావు, అడ్డాల శ్రీనివాస్, పెద్దిరెడ్డి శేషారత్నం, అంగర, పడమర ఖండ్రిక గ్రామాల అధ్యక్షులు కవల శ్రీనివాస్, గంగుమళ్ళ రాంబాబు, సిరిపురపు శ్రీనివాస్, నక్కా సింహాచలం, మండలంలోని 19 గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు ప్రశంసించారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు మాట్లాడుతూ పేదలకు సేవలందించే మనసున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూపకల్పనలోని వలంటీర్ వ్యవస్థ దేశాన్నే ఆకర్షిస్తుందన్నారు. వలంటీర్ వ్యవస్థ పనితీరు కారణంగా ప్రజా ప్రతినిధులకు సైతం మంచిపేరును తెచ్చిందన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని మరోసారి ఆదరించాలని ప్రజలు గుర్తించాలన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ యర్రా వీరన్నబాబు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, వైఎస్సార్‌సీపీ అనుబంధ సంఘాల నాయకులు పసలపూడి శ్రీనివాస్, అరదాని శ్రీదేవి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



వలంటీర్‌కు అవార్డునందజేస్తున్న ఎమ్మెల్సీ తోట

అభివృద్ధే లక్ష్యంగా సీఎం కృషి : ఎమ్మెల్సీ తోట

కపిలేశ్వరపురం (మండపేట): అభివృద్ధే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశేష కృషి చేస్తున్నారని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. మండపేట మండలం ఏడిద సీతానగరంలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. గ్రామంలోని నూతనంగా నిర్మించిన సచివాలయ భవనం, జగనన్న కాలనీలో గ్రావెల్ రహదారులు, విలేజ్ హెల్త్ భవనం, రైతు భరోసా కేంద్రం, దళితవాడలోని పలు రహదారులను ఎమ్మెల్సీ తోట ప్రారంభించారు. గ్రామానికి చెందిన ప్రజాప్రతినిధులు, ప్రముఖులు మాట్లాడుతూ రూ.3.52 కోట్లతో గ్రామాభివృద్ధి చేసిన ఎమ్మెల్సీ తోటకు కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్సీ తోట మాట్లాడుతూ గత టీడీపీ అస్తవ్యస్తంగా వదిలేసిన సిమెంట్ రహదారిని తన హయాంలో పూర్తి చేశానన్నారు. గ్రామంపై ఎమ్మెల్యే వేగుళ్ల చిన్నచూపు చూడడం ఆయన వైఖరికి నిదర్శనమన్నారు. ప్రణాళికాబద్ధంగా గ్రామాలను అభివృద్ధి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉండమట్ల శ్రీనివాస్, జెడ్పీటీసీ కుడుపూడి భవాని, సర్పంచ్ వరద చక్రవర్తి, ఎంపీటీసీ అడ్డాల శ్రీదేవి, వైఎస్సార్ సీపీ యువనేత తోట పృథ్వీరాజ్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి దూలం వెంకన్నబాబు, గ్రామ అధ్యక్షులు వేగిరాజు గోపాలకృష్ణంరాజు, నాయకులు అడ్డాల రామరాజు, కడుపూడి రాంబాబు, ఏడిద సర్పంచ్ బూరిగ ఆశీర్వాదం, జంగం కార్పొరేషన్ డైరెక్టర్ మేగడ శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ రామిశెట్టి శ్రీహరి, ఏఎంసీ డైరెక్టర్ పలివెల సుధాకర్, వార్డు సభ్యులు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



ఏడిద సీతానగరంలో అభివృద్ధి పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ తోట

సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంచుకోవాలి



కాజులూరు హైస్కూల్‌లో విజేతలకు జ్ఞాపికలు అందజేస్తున్న ఎం.శ్రీనివాస్‌వినీల్ తదితరులు

కాజులూరు: సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంచుకుని ప్రతి విద్యార్థి ఒక శాస్త్రవేత్తగా ఎదగాలని జిల్లా సైన్స్ అధికారి ఎం.శ్రీనివాస్‌వినీల్ అన్నారు. బుధవారం జాతీయ సైన్స్ దినోత్సవం పురస్కరించుకుని కాజులూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు సృజనాత్మకతను మేళవించి సుమారు 100 సాంకేతిక అంశాలపై ప్రదర్శనలు నిర్వహించారు. రంగవల్లి పోటీలు పలు సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. పరిసర గ్రామాలకు చెందిన పలు పాఠశాలల విద్యార్థులు ఈ ప్రదర్శనలను తిలకించగా అధికారులు ప్రతిభ కనపరచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. జిల్లా సైన్స్ అధికారి ఎం.శ్రీనివాస్‌వినీల్ మాట్లాడుతూ విద్యార్థులు పాఠ్యాంశాలను బట్టీ పట్టే విధానాన్ని విడనాడి ప్రతి అంశంపైనా అవగాహన పెంచుకునే విధానాన్ని పెంపొందించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ దండంగి సరోజిని, పాఠశాల సైన్స్ ఉపాధ్యాయులు సత్యప్రసాద్, అటల్ టింకరింగ్ ల్యాబ్ ఇన్చార్జ్ చింతా సత్యనారాయణ, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామీణ టైలర్లకు చేతినిండా పని

కాజులూరు: సీఎం వైఎస్ జగనన్న దయవల్ల రాష్ట్రంలోని గ్రామీణ టైలర్లకు చేతి నిండా పని దొరికిందని కాజులూరు మండల టైలర్స్ యూనియన్ అధ్యక్షుడు ఉడతా గోపాలకృష్ణ అన్నారు. గొల్లపాలెంలో బుధవారం స్థానిక గ్రామ టైలర్స్ సంఘం అధ్యక్షుడు నాలి కోటేశ్వరరావు అధ్యక్షతన అంతర్జాతీయ టైలర్స్ డే నిర్వహించారు. టైలరింగ్ సృష్టికర్త విలియమ్స్ హోవే చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించి పుట్టినరోజు కేక్ కట్ చేసి సభ్యులకు పంచారు. గోపాలకృష్ణ మాట్లాడుతూ గతంలో స్కూల్ యూనిఫామ్‌లను పాలకులు కమీషన్ల కోసం కక్కుర్తిపడి కార్పొరేట్ సంస్థలకు కాంట్రాక్ట్ ఇచ్చి కుట్టించేవారని, ముఖ్యమంత్రి జగనన్న స్కూల్ పిల్లలకు యూనిఫామ్ క్లాత్ ఇస్తూ కుట్టు కూలీ డబ్బుల రూపంలో ఇవ్వటంతో తమకు చేతి నిండా పనిదొరికిందన్నారు. జగనన్న చేదోడు పథకం ద్వారా ప్రతి టైలర్‌కు రూ.10,000 ఆర్థిక సహకారం అందించి ఆదుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో టైలర్స్ సంఘం కార్యదర్శులు పిల్లి అప్పలకొండ, గోపి మురళీకృష్ణ, త్రిమూర్తులు, చీపూరి శ్రీనివాసు, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా టైలర్స్ డే..

రామచంద్రపురం రూరల్: కుట్టుమెషీన్ సృష్టికర్త డాక్టర్ విలియం హో జయంతిని పురస్కరించుకుని ద్రాక్షారామలో భీమేశ్వర టైలర్స్ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం టైలర్స్ డే ను ఉత్సాహంగా నిర్వహించారు. యూనియన్ గౌరవాధ్యక్షుడు ఎస్.నబీ, పాలిక త్రిమూర్తులు, అధ్యక్షుడు పిల్లి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు పిల్లి వాసు, కార్యదర్శి విప్పర్తి ఏడుకొండలు, కోశాధికారి కేశనకుర్తి వెంకటేశ్వరరావు, సహకారం సంఘం అధ్యక్షుడు కొసనా కామేశ్వరరావు, బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు, రైల్వే బోర్డు సభ్యుడు పెయ్యల రాంబాబులు విలియం హో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. రాంబాబు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న విశ్వకర్మ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



ద్రాక్షారామలో విలియం హో చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న టైలర్స్ నాయకులు



అంగరలో విలియం హో చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న టైలర్లు

ఘనంగా టైలర్స్ డే

కపిలేశ్వరపురం: అంగరలో బుధవారం టైలర్స్ డేను ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన ఆది గణపతి టైలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో విలియం హో చిత్రపటం వద్ద నివాళులు అర్పించారు. అనంతరం టైలర్ల సమస్యలపై చర్చించి పలు నిర్ణయాలు తీసుకున్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు సీహెచ్ సోమేశ్వర రావు, మండల అధ్యక్షులు లేగా సుబ్రహ్మణ్యం, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ స్వామి, నాయకులు కంద చక్రవర్తి, జె.వెంకటరమణ, కొసెట్టి సత్యనారాయణ, వెల్ల నాగేశ్వరావు, పసలపూడి కృష్ణ పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ లబ్ధి చేకూరింది

- సీఎం జగన్‌ను ఆశీర్వదించండి
- వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ సూర్యప్రకాష్

రామచంద్రపురం: గత అయిదేళ్ల వైఎస్సార్ సీపీ పాలనలో నవరత్న పథకాల ద్వారా ప్రతి కుటుంబానికీ ఏదో ఒక సంక్షేమ పథకంతో లబ్ధి చేకూరిందని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాష్ అన్నారు. పట్టణంలోని మూడో వార్డు అంకం వారి వీధిలో బుధవారం పర్యటించారు. ప్రతి ఇంటికీ వెళ్లి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ద్వారా జరిగిన లబ్ధిని అడిగి తెలుసుకున్నారు. ప్రజలు విన్నవించిన సమస్యలను సావధానంగా వింటూ అధికారులకు నివేదించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. సూర్యప్రకాష్ మాట్లాడుతూ గత ప్రభుత్వాలకు భిన్నంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అర్హులైన ప్రతి ఒక్కరికీ పారదర్శకంగా సంక్షేమ పథకాలను అందించటం ద్వారా ప్రజల్లో మంచి ఆదరణను చూరగొన్నారన్నారు. దీంతో రాబోయే ఎన్నికల్లో తిరిగి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా అవ్వటం ఖాయంగా కనిపించటంతో ప్రతిపక్షాలు ఏదో రకంగా కుట్రలు చేసి పొత్తులతో వస్తున్నాయన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ద్వారా లబ్ధి చేకూరితే తనను ఆశీర్వదించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కోరుతున్నారని, కానీ ప్రతిపక్ష టీడీపీకి మాత్రం ఇది చేశాం మాకు ఓటు వెయ్యండి అని అడిగే అర్హత లేదని సూర్యప్రకాష్ విమర్శించారు. లబ్ధి చేసి ఓటు వేయాలని ప్రతి ఇంటికీ వెళ్లి కోరుతున్న పార్టీ దేశంలో ఎక్కడా లేదని అదీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నిబద్ధతని సూర్యప్రకాష్ పేర్కొన్నారు. మున్సిపల్ చైర్ పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, వైస్ చైర్మన్‌లు కోలమూరి శివాజీ, పార్టీ పట్టణ కన్వీనర్ గాదంశెట్టి శ్రీధర్, స్థానిక పార్టీ నేతలు బండారు వెంకటరమణ, కొప్పిశెట్టి శ్రీను, కొసనా ప్రసాద్, యనమదల సుబ్రహ్మణ్యం, సత్తి శంకర్‌రెడ్డి, మల్లిడి సత్తిరెడ్డి, గృహసారథులు, పార్టీ కార్యకర్తలు నేతలు పాల్గొన్నారు.



పట్టణంలోని అంకం వారి వీధిలో పర్యటిస్తున్న పార్టీ కోఆర్డినేటర్ సూర్యప్రకాష్ తదితరులు

దళితుల అభ్యున్నతికి ప్రభుత్వం తోడ్పాటు

కపిలేశ్వరపురం (మండపేట): రాష్ట్ర ప్రభుత్వం దళితుల అభ్యున్నతికి తోడ్పాటునిస్తోందని మండపేట మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి, కో ఆప్షన్ సభ్యులు రెడ్డి రాధాకృష్ణ అన్నారు. మండపేట పట్టణంలో ప్రభుత్వ రుణసాయంతో మంజూరైన మూడు సెప్టిక్ ట్యాంకులను పురపాలక సంఘం కార్యాలయం వద్ద చైర్‌పర్సన్, కమిషనర్, కో ఆప్షన్ సభ్యుల చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేశారు. 25వ వార్డులో 10 మంది రెల్లి సామాజిక వర్గీయులకు రెండు వాహనాలు, 8వ వార్డులో ఐదుగురు ఎస్సీ సామాజిక వర్గీయులకు ఒక వాహనాన్ని మంజూరు చేశారు. కౌన్సిలర్ మందపల్లి రవి, మున్సిపల్ వైస్ చైర్మన్లు పిల్లి గణేశ్వరరావు, వేగుళ్ల నారయ్య బాబు, కౌన్సిలర్లు ఎర్నేన ప్రభావతి, మలసాని సీతామహాలక్ష్మి,శెట్టి కళ్యాణి, గ్రంధి శ్రీనివాస్, బొక్కా సరస్వతి, జొన్నపల్లి విజయలక్ష్మి, అమలదాసు లక్ష్మి, నీలం దుర్గ, మొండి భవాని, పిల్లి శ్రీనివాసు, మారిశెట్టి సత్యనారాయణ, కో ఆప్షన్ సభ్యులు జంగా శాంతకుమారి పాల్గొన్నారు.



సెప్టిక్ ట్యాంకుల ప్రారంభ కార్యక్రమంలో చైర్‌పర్సన్, కమిషనర్, కో ఆప్షన్ సభ్యులు

కోటి రాజుకు ప్రజా సంఘాల నివాళి

రామచంద్రపురం రూరల్: శిరోముండనం కేసులో ప్రధాన సాక్షిగా ఉండి ఈ నెల 20న మృతి చెందిన కోటి రాజు సంతాప సభ వెంకటాయపాలెంలో బుధవారం నిర్వహించారు. రాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా నాయకుడు అయితాబత్తుల రామేశ్వరరావు, దళిత ఐక్య పోరాట వేదిక కన్వీనర్ వెంటపల్లి భీమశంకరం, కోకన్వీనర్ చీకట్ల వెంకటేశ్వరరావు, ఎస్సీ, ఎస్టీ ఫెడరేషన్ కాకినాడ నాయకులు తుమ్మల నూకరాజు, సీఐటీయూ నాయకులు నూకల బలరాం, సీనియర్ న్యాయవాది నీలం మధుసూదనరావు తదితరులు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన శిరోముండనం కేసులో నిందితులు ఎన్ని ప్రలోభాలకు లోను చేసినా న్యాయం నిలబడిన కోటి రాజు వ్యక్తిత్వాన్ని కొనియాడారు. తన తుది శ్వాస వరకు నిందితులకు శిక్ష పడాలని తపన పడ్డాడన్నారు. కానీ 28 సంవత్సరాలుగా ఈ కేసులో ముద్దాయిలు, బాధితులు, సాక్షులు చనిపోతున్నా ఇప్పటికీ న్యాయం జరగపోవడం శోచనీయన్నారు. బాధితులకు తక్షణం న్యాయం జరిగేలా ఇప్పటికైనా ప్రభుత్వం చూడాలని కోరారు. కార్యక్రమంలో మాల మహానాడు నాయకుడు సిద్దాంతుల కొండబాబు, పీడీఎస్‌యూ నాయకుడు బి.సిద్ధూ, బీఎస్పీ నాయకుడు మాత సుబ్రహ్మణ్యం, దళిత ఐక్య వేదిక నాయకులు వెంటపల్లి రామకృష్ణ, గుబ్బల శ్రీను, చల్లపూడి పట్టాభిరామయ్య, దడాల వెంకటరమణ, కోటి చిన్నరాజు, కోటి రాజు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



వెంకటాయపాలెంలో కోటి రాజు సంతాప సభలో మాట్లాడుతున్న అయితాబత్తుల రామేశ్వరరావు

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రామచంద్రపురం రూరల్: మండలంలోని ద్రాక్షారామ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మార్చి ఒకటిన శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ద్రాక్షారామ విద్యుత్ శాఖ ఏఈ శీలం యేసురాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రామంచద్రపురం డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వై.విజయానంద్ సూచనల మేరకు సబ్ స్టేషన్ మరమ్మతులు చేపడుతున్న కారణంగా సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని ఆయా గ్రామాల ప్రజలు సహకరించాలని కోరారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కాజులూరు: గొల్లపాలెం 33/11 కేవీ విద్యుత్ స్టేషన్ పరిధిలోని కాజులూరు, కరప మండలాల్లోని పలు గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఏపీఈపీడీసీఎల్ కాకినాడ డీఈ జి.ప్రసాద్ తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేయవలసి వస్తుందన్నారు. గొల్లపాలెం సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలకు, కరప మండలంలోని కొన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

శాస్త్రీయ ఆలోచనను అలవర్చుకోవాలి

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట పట్టణం, మండపేట రూరల్ మండలం, కపిలేశ్వరపురం మండలాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో బుధవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కపిలేశ్వరపురం మండలం మాచర జెడ్పీ ఉన్నత పాఠశాలలో మాచర పూర్వ విద్యార్థుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో హెచ్ఎం రమాదేవి అధ్యక్షతన నిర్వహించిన సైన్స్ దినోత్సవంలో విద్యార్థులు పలు సైన్స్ ప్రయోగాలను ప్రదర్శించారు. వాటిని ఎంఈఓ కె.తాతారావు, ప్రొఫెసర్ గొడవర్తి భాగవన్నారాయణలు పరిశీలించి ప్రశంసించారు. విద్యార్థుల పలు సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఉత్తమ సేవలందిస్తున్న ఉపాధ్యాయులు వాడ్రేవు శ్రీనివాస్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మానవాళి మనుగడ సైన్స్‌తోనే సాధ్యం...

మానవాళి మనుగడ సైన్స్ ఆచరణతోనే సాధ్యమవుతుందని మండపేట మండలంలోని పలు పాఠశాలల్లో నిర్వహించిన సైన్స్ దినోత్సవం, జనవిజ్ఞాన వేదిక ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమాల్లో పాల్గొన్న వక్తలన్నారు. వివిధ అంశాలపై విద్యార్థులు రూపొందించిన సైన్స్ ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. జన విజ్ఞాన వేదిక జిల్లా నాయకులు గొడవర్తి సుధాకర్, తదితర నాయకులు విద్యార్థులను ప్రశంసించారు. ఉత్తమ ప్రదర్శనలను ప్రశంసిస్తూ విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్చార్జి హెచ్ఎం పలివెల రుద్ర, స్టాఫ్ సెక్రటరీ గండి స్వామి ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మండపేటలో మాట్లాడుతున్న గండి స్వామి ప్రసాద్



మాచరలో విద్యార్థుల ప్రదర్శనలను పరిశీలిస్తున్న ప్రముఖులు

సైన్స్‌తోనే సమాజాభివృద్ధి



విజేతలకు బహుమతులు అందజేస్తున్న శ్రీను తదితరులు

రాయవరం: సైన్స్‌తోనే సమాజాభివృద్ధి సాధ్యమవుతుందని ప్రముఖ వైద్యులు బీహెచ్‌పీఎస్ వీర్రాజు, జీఎస్ఎన్ రెడ్డి పేర్కొన్నారు. రాయవరం శ్రీరామయ్య జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం జాతీయ సైన్స్ దినోత్సవం నిర్వహించారు. పాఠశాల హెచ్ఎం వీఎస్ సునీత అధ్యక్షతన జరిగిన సమావేశంలో డాక్టర్ వీర్రాజు, డాక్టర్ జీఎస్ఎన్ రెడ్డి మాట్లాడారు. సమావేశంలో విద్యాదాత తాళ్ళ శ్రీను, తూర్పుగోదావరి జిల్లా బ్లడ్ డోనర్స్ చైర్మన్ వెలగల ఫణికృష్ణారెడ్డి, శాక్షా టెక్నాలజీస్ అధినేత రెడ్డి సత్యనారాయణ, సీనియర్ నాయకుడు మంతెన అచ్చియ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జి.దొంతమూరుకు చెందిన విద్యాదాత తాళ్ల శ్రీను పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన ఎ.వెంకట అనంత శ్రీకర్‌కు ల్యాప్‌టాప్, పి.శ్రీరామ్ రత్నకుమార్ డెస్క్‌టాప్, తృతీయ స్థానంలో నిలిచిన జలపుష్పకు డెస్క్‌టాప్ అందజేశారు. ఆరు నుంచి పదో తరగతి వరకు ఉత్తమ ఫలితాలు కనబరిచిన విద్యార్థులకు మెమెంటోలు, మెడల్స్, స్టేషనరీ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సైన్స్ ఎగ్జిబిషన్స్

రాయవరం: నేటి ఆధునిక, సాంకేతిక యుగంలో నేటి విద్యార్థుల నవీన ఆవిష్కరణలతో సైన్సు కొత్తపుంతలు తొక్కుతుందని పలువురు పేర్కొన్నారు. మండలంలోని పలు ఉన్నత పాఠశాలల్లో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయుల ఆధ్వర్యంలో సైన్స ఎగ్జిబిషన్స్ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ సీవీ రామన్ తన అసమాన ప్రతిభ, అద్భుత ఆవిష్కరణల గురించి కొనియాడారు. పలు పాఠశాలల్లో విద్యార్థులు ప్రదర్శించిన సైన్స్ ఎక్స్‌పో విద్యార్థులను, తల్లిదండ్రులను, ఆహుతలను అలరించింది. సీవీ రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సైన్స్ డే పురస్కరించుకుని ఆయా పాఠశాలల్లో నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. రాయవరం, వెదురుపాక, సోమేశ్వరం, మాచవరం, పసలపూడి, చెల్లూరు, వెంటూరు, కూర్మాపురం జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో ఆయా పాఠశాలల హెచ్ఎంల ఆధ్వర్యంలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని నిర్వహించారు.